క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడిగా గోవింద్

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్షుడిగా మాచర గ్రామ శివారు మాచర మట్లలకు చెందిన శీలం గోవింద్ నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి గోవింద్ కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కె.గంగవరం: ఇటీవల అప్పులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు దాతలు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సత్యవాడ గ్రామానికి చెందిన మందపాటి వెంకన్న, కూళ్ల గ్రామానికి చెందిన తిరుకోటి నాగమణి ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్, డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా నిత్యావసర సరకులు, కూరగాయలు, బియ్యాన్ని అందించారు. నాయకులు ముంగి రమేష్, దేవరపల్లి చక్రి, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

కాజులూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. కాకినాడ ఇనోదయ హాస్పటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ డీఎస్ఎస్ ప్రకాష్, ఎం.గౌతమ్‌కృష్ణ, నెక్కంటి మాధవరావు, పిల్లి వరప్రసాద్, నితీష్‌సింగ్ తదితర నిపుణులైన వైద్యులు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

కోలాహలంగా గణనాథుడి నిమజ్జనం



భారీ గణనాథుడి ఊరేగింపు

మండపేట: స్థానిక కొండపల్లి వారి వీధిలోని వేగుళ్ల వారి దొడ్డిలోని భారీ గణనాథుని నిమజ్జనం ఆదివారం కోలాహలంగా జరిగింది. గత 18 సంవత్సరాలుగా కమిటీ సభ్యులు ఏటా హైదరాబాద్ నుంచి 16 అడుగుల భారీ గణేష్ విగ్రహాన్ని తీసుకువచ్చి ఇక్కడ వేడుకగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ముగియడంతో గారడీ నృత్యాలు, డీజేలతో ఉత్సవ కమిటీ సభ్యులు మండపేటలో గణేష్ విగ్రహాన్ని ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు.

ఈ నెలాఖరు వరకూ నిషేధాజ్ఞలు

రామచంద్రపురం: స్థానిక పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నుంచి 31వ తేదీ వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి నిర్వహించకూడదన్నారు. రామచంద్రపురం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, రాయవరం, అంగర, పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రాంతాలకు ఈ నిషేధాజ్ఞలు వర్తిస్తాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలని, లేకుంటే చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వెంకట అప్పలాచార్యర్ మృతి



శృంగారం వెంకట అప్పలాచార్యర్ (ఫైల్)

రామచంద్రపురం: మయూర కళాపరిషత్ ద్వారా నాటక రంగానికి ఎంతో విశేష కృషి చేసిన కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు శృంగారం వెంకట అప్పలాచార్యర్ ఆదివారం అనారోగ్యంతో కాకినాడలో మృతి చెందారు. ఆయన మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సత్తి వెంకటరెడ్డి, వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, ప్రముఖ వైద్యులు మురళీకృష్ణ, రామచంద్రపురం నియోకవర్గ సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు సంతాపం తెలిపారు.

రామచంద్రపురం రూరల్: అప్పలాచార్యర్(ఆచారి) మృతికి ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, కార్యదర్శి వై.సరోజ, కోశాధికారి వి.రాంబాబు, ఉపాధ్యక్షుడు వై.కొండ, సహాయ కార్యదర్శి సతీష్ పలువురు సంతాపం తెలిపారు.

వాసవీ క్లబ్ గవర్నర్ పదవికి నామినేషన్ దాఖలు

రాయవరం: వాసవీ క్లబ్ 215ఏ జిల్లా గవర్నర్ పదవికి కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ ఆదివారం రాయవరంలో నామినేషన్ వేశారు. 2024 సంవత్సరానికి గవర్నర్ పదవికి నామినేషన్ వేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న సీవీవీఎస్ఎన్ మూర్తి సమక్షంలో ప్రవీణ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. నవంబర్‌లో గవర్నర్ ఎన్నిక లాంఛనంగా జరుగుతోంది. నామినేషన్ ప్రక్రియలో పూర్వపు గవర్నర్లు బోడా సాయిసూర్యప్రకాష్, శ్రీకాకుళపు కరుణకుమార్, నంబూరు నాగేశ్వరరావు, రమేష్ తదితరులు నామినేషన్ ప్రక్రియలో హాజరయ్యారు.

కదిలిన ప్రజా ఆరోగ్య రథచక్రం

- గ్రామాల్లో పేదలకు వైద్య పరీక్షలు
- ప్రతి వ్యక్తికీ కేస్ షీట్ తయారీ
- మెరుగైన చికిత్సకు ప్రత్యేక వైద్య శిబిరాలు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు



అంగరలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కపిలేశ్వరపురం: ఒకప్పుడు ప్రభుత్వ వైద్యమంటే ఆసుపత్రిలో పట్టించుకోరనీ, డాక్టరు ఉండరనీ, రక్త పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లో చేసుకోమంటారనీ, నాణ్యమైన మందులు ఉండవన్న భావన ప్రజల్లో బలంగా ఉండేది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత ప్రభుత్వ వైద్యం తీరు మారింది. ఆసుపత్రి వైద్యుడు పేదల ఇంటికి వెళ్లి మరీ వైద్యసేవలందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఆరోగ్య వైద్య సిబ్బంది ప్రజల ముంగిటకు చేరి వైద్య పరీక్షలు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమిదీ

క్షేత్ర స్థాయిలోని వైద్య ఆరోగ్య కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను ఆరా తీస్తున్నారు. వ్యక్తి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు రక్తపోటు, షుగర్, యూరిన్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ తదితర పరీక్షలను చేస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలు పొందేందుకు టోకెన్‌లను ఇస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించే గ్రామాల్లోని వైద్య శిబిరాల్లో పీహెచ్‌సీ వైద్యులతో పాటు ప్రత్యేక వైద్య నిపుణులు సైతం సేవలందిస్తారు.

మండపేట నియోజకవర్గంలో వైద్యులు వీరే...

- మండపేటలో అక్టోబర్ 3, 4, 6, 10, 12, 17, 19, 21, 26వ తేదీల్లో నిర్వహించనున్న శిబిరంలో మండపేట స్వస్థ హాస్పటల్ జనరల్ సర్జియన్ డా.రఘురామ్, మండపేట బిక్కిన నర్సింగ్ హోమ్ జనరల్ సర్జియన్ డాక్టర్ యు.భార్గవి, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి జనరల్ సర్జియన్ డాక్టర్ బి.సౌమ్య, ఆర్థో నిపుణులు డాక్టర్ వంశీకృష్ణ, ఈఎన్‌టీ డాక్టర్ డి.మోహన్‌బాబు, అమలాపురం కిమ్స్ జనరల్ మెడిసన్ డాక్టర్ లాగిశెట్టి మహేష్ సేవలందిస్తారు.
- రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో ఈ నెల 6, 4, 10, 12, 17, 19, 21, 26లలో నిర్వహించే శిబిరాల్లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి జనరల్ సర్జియన్ డా.బి.సౌమ్య, ఆర్థోనిపుణులు డా.వంశీకృష్ణ సేవలందిస్తారు. ఈ నెల 3, 5, 7, 11, 13, 18, 20, 25లలో నిర్వహించే శిబిరాల్లో రాయవరం కేవీఆర్ హాస్పిటల్ ఓబీజీ డాక్టర్ కన్యాకుమారి, ఆర్థో డాక్టర్ కె.రాము సేవలందిస్తారు.
- కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో ఈనెల 04, 06, 09, 11, 13, 17, 19, 25, 28 లలో నిర్వహించే శిబిరాల్లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ ఎస్‌కే అర్షతున్నీషా, ఆర్థో స్పెషలిస్టు డాక్టర్ కె.వర్మ్మ తరుణ్, ఈ నెల 3, 5, 7, 10, 12, 16,18, 20, 27లలో నిర్వహించే శిబిరంలో మండపేట నారాయణరెడ్డి ఆసుపత్రి జనరల్ మెడిసిన్ ఆక్టర్ కె.రమ్యలక్ష్మి, మండపేట బిక్కిన నర్సింగ్ హోం ఆర్థో నిపుణులు డాక్టర్ వి.కృష్ణలోకేష్ సేవలందిస్తారు.
- వానపల్లి పీహెచ్‌సీ పరిధిలోని కపిలేశ్వరపురం మండలం కేదారిలంకలో గ్రామస్తులకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఓబీజీవై డాక్టర్ జె.ప్రియాంక, జనరల్ సర్జియన్ డాక్టర్ ఎల్ఎస్ సౌజన్య చికిత్సనందిస్తారు. వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలోని కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక గ్రామస్తులకు కిమ్స్ ఆసుపత్రి ఓబీజీవై డా.సోఫియా, పీఈఏడీ డాక్టర్ బత్తుల ప్రశాంత్ చికిత్సనందిస్తారు.

రామచంద్రపురంలో ప్రత్యేక వైద్యులు వీరే...

- రామచంద్రపురం మండలంలో గత నెల 30, ఈ నెల 4, 6, 9, 11, 13, 17, 19, 27, 30లలో నిర్వహించే శిబిరాల్లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఓబీజీవై డాక్టర్ లిదియా, జనరల్ సర్జియన్ డాక్టర్ టి.ఆనంద్, రాయవరం చాణక్య ఆసుపత్రి ఓబీజీవై డాక్టర్ ఎం.ప్రత్యూషారెడ్డి, ఆర్థో నిపుణులు డాక్టర్ జి.గోపీ రవితేజ, రామచంద్రపురం గాంధీ ఆసుపత్రి ఓబీజీవై డాక్టర్ ప్రియాంక, జనరల్ మెడిసిన్ డాక్టర్ వి.శ్రీనివాస్ వైద్యసేవలందిస్తారు.
- కె.గంగవరం మండలంలో ఈ నెల 4, 6, 9, 11, 13, 17, 20, 24, 26, 28లలో నిర్వహించే శిబిరాల్లో
- అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆర్థో డాక్టర్ పి.హర్ష,
- రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి డెర్మటాలజిస్ట్ డాక్టర్ జి.సుశీల సేవలందిస్తారు. ఈ నెల 3, 5, 7, 12, 16, 18, 21, 25, 27 లలో నిర్వహించే శిబిరాల్లో రామచంద్రపురం గాంధీ ఆసుపత్రి ఓబీజీ డాక్టర్ సి.కవిత, కమల నర్సింగ్ హోం ఆర్థో చెలికాని రామారావు చికిత్సనందిస్తారు.

అనుభవం ఉన్న వైద్యులతో..



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రత్యేక వైద్య నిపుణులు శిబిరాల్లో చికిత్సనందిస్తారు. అన్ని విభాగాల నిపుణులు శిబిరాల్లో అందుబాటులో ఉంటారు.

– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

సహకరించండి..



గ్రామాల్లోని, పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో భరోసా కలుగుతోంది. ఏడు రకాల పరీక్షలు నిర్వహించడంతో శరీరంలో ఆరోగ్య సమస్యలు బయటపడే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– కరుణేంద్రకుమారి, వైద్యాధికారి, అచ్యుతాపురం పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

జగన్ నాయకత్వానికి తరగని ఆదరణ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- పార్టీలో చేరికలే నిదర్శనం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల్లోనూ విశేష ఆదరణ కనిపిస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పార్టీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త నేమాని కృష్ణ రాజశేఖర్ ఆధ్వర్యంలో మండపేట గోల్డ్ మార్కెట్ సెంటర్, మారేడుబాకకు చెందిన వంద మందికి పైగా స్థానికులు ఆదివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారంతా సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయానికి కష్టించి పనిచేయాలని ఎమ్మెల్సీ తోట పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ఇంటి శ్రీను, మెర్ల సుబ్బారావు చౌదరి, పుత్సకాయల పాపారావుచౌదరి, ముత్యాల రమేష్ చౌదరి, కోనే దుర్గాదేవి, మేడిశెట్టి నాగలక్ష్మి, కందుల కుమారి, పితాని ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా సీఎం జగన్ సాగిస్తున్న సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట సమర్ధవంతమైన నాయకత్వానికి ఆకర్షితులై తామంతా పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నేత మేకా శ్రీనివాస్, శీతిన సూరిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో జుత్తుక హరేరాము, బొడ్డపాటి గంగరాజు, సూరంపూడి ఏసు, త్రిపురారి లక్ష్మీస్వర్ణ, వెల్బూరి జ్యోతి, ఖండవిల్లి మంగాదేవి, వనుం లక్ష్మి తదితరులు ఉన్నారు.

మండపేటలో అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న డాక్టర్ రాము

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక బస్టాండు వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బస్టాండు వద్ద తొలిసారిగా ఈ ఏడాది నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి రాజేష్, నరేష్ (చిన్నారి) సోదరులు గణపతి నవరాత్రులు ప్రారంభించి ఘనంగా వేడుకలు నిర్వహించారు. నిమజ్జనం అనంతరం దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు, సాయి ఆర్థో అధినేత డాక్టర్ రాము ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకుడు సాధనాల శివభగవాన్, ఉత్సవ కమిటీ సభ్యులు అంజిబాబు, అయినవిల్లి ఆదినారాయణ, వెన్నా శేషు, జీఆర్సీ మోహన్, కోయల సాయిబాబా, కాయల రాము, కాయల చంద్రశేఖర్, కాయల రమేష్, కోయల సతీష్, రావూరి దుర్గాప్రసాద్, పిల్లా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట: పట్టణంలోని 15వ వార్డు ధర్మగుండం మీద సంతాన గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీగా అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, వైఎస్సార్ సీపీ నేతలు ఓగిరాల దేవి, జిన్నూరి సాయిబాబా, మేకా శ్రీనివాస్, తాడి రామారావు, శీతిన సూరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వెంకన్నబాబు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో గాంధీజీ గుర్తులు



గొల్లపాలెంలో మహాత్మాగాంధీ సభ నిర్వహించిన ప్రాంతం (గాంధీ స్టేజీ)

కాజులూరు: గొల్లపాలెంలో మహాత్మగాంధీ సభ నిర్వహించిన ప్రాంతం 'గాంధీస్టేజి'గా పిలుస్తున్న చారిత్రిక ఆధారంగా నిలిచి ఉంది. గ్రామంలో 1939 ప్రాంతంలో అడదాకుల సుబ్బారావు అనే స్వాతంత్ర సమర యేధుడు 12 సంవత్సరాల క్రితం పరమపదించారు. స్థానికుల్లో చైతన్యం నింపుతూ స్వాతంత్ర సాధన ఉద్యమంలో ఎంతో మందిని సుబ్బారావు భాగస్వామ్యులు చేశారు. ఆయన కోరిక మేరకూ ఉప్పు సత్యగ్రహంలో భాగంగా జిల్లాకు వచ్చిన గాంధీజీ గొల్లపాలెంకు వచ్చారు. కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని ఉన్న మార్కెట్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. గ్రామస్తులు రూ.10 వేలు విరాళం ఇచ్చి ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు. అప్పటిలో గొల్లపాలెం కళంకారి వస్త్ర అద్దకం పరిశ్రమకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండేది. ఇక్కడకు వచ్చిన గాంధీజీ కంకంకారీ వస్త్రాల తయారీని తిలకించి కళాకారులను ప్రసంశించారట. ఆ నాడు గాంధీజీ సభ నిర్వహించిన ప్రదేశంలో ఆయన వెళ్లిన తర్వాత స్థానికులు ఒక వేదిక నిర్మించి సభలు, సమావేశాలు నిర్వహించడం పండుగ సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం చేసేవారట. ఆ పై గాంధీస్టేజిగా పిలవబడే ఈ వేదికపై బాపూజీ విగ్రహంతో పాటు పలువురి జాతీయ నాయకుల విగ్రహాలను గ్రామస్తులు నెలకొల్పారు. ఇటీవల తాజా మాజీ సర్పంచ్ వడ్డి సత్యవతి, ఆమె భర్త వెంకటరమణమూర్తి (కొండబాబు) దంపతులు రూ.మూడు లక్షలు ఖర్చు చేసి గాంధీస్టేజిపై షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో అన్ని వేళలా ఇక్కడ సమావేశాలు నిర్వహించుకునేందుకు సౌలభ్యం పెరిగిందని స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఆకట్టుకున్న బియ్యపు గింజల బాపూజీ



ఇందుగమిల్లి సొధాగర్



బియ్యపు గింజలు, దారంతో సొధాగర్ రూపొందించిన చిత్రం

రాయవరం: జాతిపిత మహాత్మా గాంధీజీ 154వ జయంతి సందర్భంగా రాయవరం గ్రామానికి చెందిన ఇందుగమిల్లి సొధాగర్ మహాత్ముడి చిత్రపటాన్ని బియ్యపు గింజలు, దారంతో రూపొందించారు. సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి చిత్రాన్ని గీసి జాతిపితకు తనదైన శైలిలో నివాళులర్పించాడు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంది.

వైఎస్సార్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

మంత్రి చెల్లుబోయిన వేణు



గొల్లపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయ సాధనకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. గొల్లపాలెంలో రూ.6.36 కోట్లతో నిర్మించనున్న ర్యాపిడ్ శ్యాండ్ ఫిల్టర్స్ (ఆర్ఎస్ఎఫ్) సిస్టంకు ఆదివారం మంత్రి వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ గొల్లపాలెంలో సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా జిల్లా పరిషత్ మంచినీటి చెరువులను రక్షిత మంచినీటి పథకంగా మార్చి కరప, కాజులూరు మండలాల్లోని 28 గ్రామాలకు తాగునీటి సరఫరాను అందించారన్నారు. మహనేత తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఆ పథకాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ఆర్ఎస్ఎఫ్ సిస్టం ద్వారా శుద్ధి చేసిన జలాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ ద్వారా 27.33 కోట్లతో మండలంలో 30 ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలో అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటిని అందిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని దుగ్గుదుర్రు, కాజులూరు, తణుకువాడలలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్మించనున్న వాటర్ ట్యాంకు నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు నరేన్, ఎంపీపీ మాత భారతి మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మాజా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, దేగల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

రామచంద్రపురం: పట్టణంలోని మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో మంత్రి వేణు గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీదర్, పార్టీనేతలు కుడుపూడి గణేష్, కంచుమర్తిబాబూరావు, కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిచ్చుక సూర్యారావుకు నివాళి



సభలోమాట్లాడుతున్న మధు

రామచంద్రపురం: స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం కామ్రేడ్ పిచ్చుక సూర్యారావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు తాటిపాక మధు, సీనియర్ నాయకుడు డాక్టర్ స్టాలిన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్టాలిన్ అధ్యక్షత వహించిన ఈ సభలో మధు మాట్లాడుతూ ప్రజా సమస్యల పోరాటంతో ఆదర్శ కమ్యూనిస్టు పిచ్చుక సూర్యారావు అని కొనియాడారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు



క్రీడలను ప్రారంభిస్తున్న బుచ్చిరెడ్డి, ఏసురాజు

కాజులూరు: యువత ఉజ్వల భవిష్యత్తుకు విద్యతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి అన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 10వ అంతర్ జిల్లాల సీనియర్, పురుషులు, మహిళల సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కు జిల్లా జట్టు ఎంపికలు ఆదివారం గొల్లపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌ట్యాంక్ వెనుక ఉన్న క్రీడామైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు సంయుక్తంగా ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రెడ్డి సంక్షేమసంఘం ఉపాధ్యక్షుడు నల్లమిల్లి మాచారెడ్డి, మొగలిపాలెం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడి గనిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీరామారెడి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శిగా శ్రీనివాసు

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామచంద్రపురం డిప్యూటీ తహసీల్దార్ జి.శ్రీనివాసు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుల చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. వీఆర్వోలు, రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

సందడిగా ఏక్ తారీఖ్ - ఏక్ ఘంటే



అర్తమూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు



కూళ్లలో జరిగిన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు



నాగులచెరువులో శ్రమదానం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మండపేట: గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవలో భాగంగా అర్తమూరులో ఏక్ తారీఖ్ – ఏక్ ఘంటే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, గ్రామస్తులతో ప్రత్యేక పారిశుధ్య పనులు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి మెయిన్‌రోడ్డులోని చెత్తా చెదారం తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను తెచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. అనంతరం పారిశుద్ధ్యంపై సర్పంచ్ అన్నపూర్ణ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓ అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత గొలుగూరి సందీప్‌రెడ్డి, వార్డు సభ్యులు కొండా సూరిబాబు, మేడపాటి వీర్రెడ్డి, సచివాలయ కన్వీనర్లు తేతలి భూపతిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, నల్లమిల్లి రాంబాబు, మండ వెంకటరెడ్డి, పార్టీ నేత మండ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ర్యాలీలు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీటీసీలు పిల్లి దుర్గాప్రసాద్, కొప్పిశెట్టి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నీతిపూడి మదుబాల తదితరులు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛత శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అవగాహన ర్యాలీలు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు చిల్లే నాగేశ్వరావు, చికట్ల సునితగోపాలం, నానాపరపు కళ్యాణి శ్రీనివాస్, కొప్పిశెట్టి రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా ర్యాలీ

రామచంద్రపురం: మున్సిపాలిటీలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 6 గంటలకు కమ్మవారి సావరం రామాలయం నుంచి శీలంవారి సావరం వరకూ స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ మహా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమం సినిమాటోగ్రఫీ, సమాచార పౌరసంబంధాల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ ర్యాలీలో ప్రజలు అధికారులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో స్వచ్ఛభారత్ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సర్పంచ్‌ల సమాఖ్య మండపేట నియోజకవర్గ అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రమదానంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీలు నిర్వహించారు.